వంకాయ సాగు.. బహు బాగు

- పిప్పర్‌వాడ, పూసాయి గ్రామాల్లో అధికంగా సాగు
- మహారాష్ట్రకు ఎగుమతి చేస్తున్న రైతులు



రవాణాకు సిద్ధంగా వంకాయలు



వంకాయలు కోస్తున్న కూలీలు

జైనథ్: వంకాయ అంటేనే కూరగాయలలో రారాజు.. అలాంటి వంకాయ సాగును ప్రత్యేకంగా చేపడుతూ.. జైనథ్ మండలం పిప్పర్‌వాడ, పూసాయి గ్రామ రైతులు ఆదర్శంగా నిలుస్తున్నారు. సాంప్రదాయ పంటలతో విసిగిపోయిన కొంత మంది రైతులు కూరగాయల సాగుతో మంచి లాభాలు పొందుతున్నారు. ఈ గ్రామాలు 44వ నంబరు జాతీయ రహదారి వెంబడి ఉండడంతో రవాణాకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. దీంతో చాలా మంది రైతులు వంకాయ సాగుపై ఆసక్తి చూపుతున్నారు. దిగుబడి ఎక్కువగా ఉన్న రోజుల్లో ఆదిలాబాద్ పట్టణంలోని మార్కెట్‌తో పాటు నేరుగా లారీల్లో మహారాష్ట్రకు సైతం ఎగుమతి చేస్తున్నారు.

ఎల్లప్పుడు డిమాండే..

ఇతర కూరగాయాలతో పోలిస్తే వంకాయలకు ఎల్లప్పుడు మంచి డిమాండ్ ఉంటుందని రైతులు చెబుతున్నారు. వంకాయ ఎప్పుడు కోతకు వచ్చిన అమ్ముకోవడానికి మార్కెట్‌ల కోసం వెతుక్కోవాల్సిన అవసరం లేకపోవడంతో చాలా మంది రైతులు వంకాయ సాగుకు ముందుకు వస్తున్నారు. నేరుగా ఆదిలాబాద్, మహారాష్ట్రలకు చాలా సులభంగా ఎగుమతి చేసే అవకాశం ఉండడంతో వంకాయ సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ఇతర పంటలతో పోలిస్తే వంకాయ సాగుకు పెట్టుబడి కొంత అధికంగానే అవసరం అవుతుంది. చీడ పీడల నివారణకు పురుగుల మందు పిచికారీ, ఎరువుల వాడకం కూడా అధికంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. అయితే మార్కెట్‌ల కొదువ లేకపోవడంతో, ఎల్లప్పుడు వంకాయలకు మంచి డిమాండ్ ఉండడంతో రవాణా సదుపాయం ఉండడంతో లాభాలు పొందవచ్చని రైతులు చెబుతున్నారు.

అర ఎకరంలో వేశా..



మా గ్రామంలో చాలా మంది రైతులు వంకాయ సాగు చేస్తున్నారు. నేను కూడా ఈఏడాది అర ఎకరంలో సాగు చేసాను. రూ. 40వేల వరకు ఖర్చు వచ్చింది. కాత బాగానే వచ్చింది. కోసిన వంకాయలను స్థానికంగా అమ్ముకోవడమే కాకుండా ఆదిలాబాద్‌కు తరలిస్తున్నాం. ఇప్పటి వరకు రూ. 80వేల వరకు ఆదాయం వచ్చింది.

– కేశవ్ రెడ్డి, రైతు, పిప్పర్‌వాడ

క్లుప్తంగా

కేసీఆర్ నోట.. డివిజన్ మాట

బోథ్: సీఎం కేసీఆర్ నియోజకవర్గంలోని ఇచ్చోడలో నిర్వహించిన ప్రజాఆశీర్వాద సభలో గురువారం పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇక్కడి ప్రజల మనుసులో ఏముందో తనకు తెలుసునని బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో పాటు బోథ్‌లో డిగ్రీ కళాశాలను అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లో మంజూరు చేస్తామన్నారు.

సీఎం హామీలపై నాయకుల హర్షం

బోథ్: ఇచ్చోడలో గురువారం జరిగిన సభలో సీఎం కేసీఆర్ బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా చేస్తామని ప్రకటించడం, జనరల్ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంపై బోథ్ జెడ్పీటీసీ సంధ్యారాణి, ఎంపీపీ తుల శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్‌కి ధన్యవాదాలు తెలిపారు.

సర్పంచ్‌పై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ప్రజలకు డబ్బులు పంచిన బేల మండలం హాశంపూర్ సర్పంచ్ పోతన్ శ్యాంబుల్‌పై కేసు నమోదు చేసినట్లు టూ టౌన్ సీఐ అశోక్ తెలిపారు. ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనం ఎదుట డబ్బులు పంచుతుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఆయన నుంచి రూ. 43,100 స్వాధీనం చేసుకున్నామన్నారు.

9న లోక్ అదాలత్

ఆదిలాబాద్‌టౌన్: రాజీ మార్గంలో పరిష్కరించుకోగలిగే కేసులను డిసెంబర్ 9వ తేదీన జిల్లా న్యాయసేవాధికార సంస్థ ద్వారా నిర్వహించే లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని జిల్లా జడ్జి డాక్టర్ సీహెచ్‌వీఆర్‌ఆర్ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. కాంపౌండబుల్, క్రిమినల్, ఎక్సైజ్, సివిల్, భూ తగాదాలు, కుటుంబ కలహాలు, బ్యాంక్ రికవరీ, చిట్‌ఫండ్ కేసులు జిల్లా, మండల స్థాయిల్లోని కోర్టుల్లో పరిష్కరించుకోవచ్చని సూచించారు. వీటిపై ఎలాంటి అప్పీల్‌కు వెళ్లే అవకాశముండదని పేర్కొన్నారు.

పరామర్శ

లోకేశ్వరం: మండలంలోని పోట్‌పల్లి గ్రామంలో ధర్మపురి సతీమణి గోసుకుల రాజమణి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. గురువారం బాధిత కుటుంబసభ్యులను మున్నూరు కాపు సంఘం తాలుకా అధ్యక్షుడు రోర్ల రమేశ్ పరామర్శించారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం మండలాధ్యక్షుడు మంద లింగన్న, కుంటాల భోజన్న, చిన్నయ్య, భోజన్న ఉన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

రెబ్బెన: మండలంలోని గోలేటి టౌన్‌షిప్‌లో గురువారం తెలంగాణ గ్రామీణ బ్యాంకు గోలేటి శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. బ్యాంకు ద్వారా అందిస్తున్న సేవలను మేనేజర్ విశ్వ ప్రసాద్ వివరించారు. సురక్ష బీమా, అటల్ పెన్షన్ యోజన పథకాలు గురించి తెలియజేశారు. కళాజాత బృందం మ్యాజిక్ షో, ఆటపాటల ద్వారా బ్యాంకు పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఫీల్డ్ ఆఫీసర్ సలుగు శ్రావణ్, క్యాషియర్ సురేష్, బ్యాంకు సిబ్బంది ఇమ్రాన్, జనార్దన్, ఐకేపీ సిబ్బంది రవి, కృష్ణ పాల్గొన్నారు.

కొత్తగూడలో నగర సంకీర్తన

పెంచికల్‌పేట్: మండలంలోని కొత్తగూడ గ్రామంలో సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో గురువారం నగర సంకీర్తన నిర్వహించారు. సంకీర్తనలతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. అనంతరం హనుమాన్ ఆలయంలో భజన చేశారు. భజన మండలి అధ్యక్షుడు సాయిరాం, మహిళా భక్తులు పాల్గొన్నారు.

సబ్సిడీ టార్పాలిన్లకు మంగళం



పంటలు తడవకుండా కప్పి టార్పాలిన్

- ఐదేళ్ల నుంచి పంపిణీ చేయని ప్రభుత్వం
- వర్షాలకు తడుస్తున్న పంటలు
- నష్టపోతున్న రైతులు

తాంసి: రైతులు సాగుచేసిన పంటలు అకాల వర్షాల వలన తడిసి నష్టపోకుండా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రైతులకు రాయితీపై వ్యవసాయశాఖ ద్వారా టార్పాలిన్లు అందించేది. అయితే గత ఐదు సంవత్సరాలు నుంచి పంపిణీ చేయడం ప్రభుత్వం నిలిపి వేసింది. ప్రస్తుతం రైతులు పండించిన పంటలు, కోత దశలో, చేతికివచ్చే సమయంలో తడిసి పోతున్నాయి. దీంతో నాణ్యత దెబ్బతిని మద్దతు ధర లభించే అవకాశం ఉండడం లేదు.

అకాల వర్షాలతో ఆందోళన..

ప్రస్తుతం రైతులు సాగు చేసిన పంటలు చేతికి వస్తుండడంతో కొన్నిచోట్ల జొన్న, వేరుశనగ పెసర, మినుము, నువ్వు పంటలు కురుస్తున్న వర్షాలకు తడిసిపోయాయి. రైతులు దిగుబడి వచ్చిన వివిధ రకాల పంటలను అకాల వర్షాల నుంచి కాపాడుకోవడానికి నానా అవస్థలు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి చాలా చోట్ల చేతికి వచ్చిన పంటలు తడిసి పోయాయి.

తడిసిపోతున్న పంటలు..

చేతికి వచ్చిన పంటలను రైతులు కాపాడుకునేందుకు సరైన వసతులు లేవు. దీంతో పంటలు తడిసి పోతున్నాయి. జొన్న, వేరుశనగ, పెసర, మినుము, నువ్వు పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఐదేళ్లుగా సబ్సిడీపై టార్పాలిన్లు అందించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సబ్సిడీపై టార్పాలిన్లు అందజేసి రైతులు నష్టపోకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

టార్పాలిన్లు అందించాలి



సన్న, చిన్నకారు రైతులకు ఎంతో ఉపయోగకరమైన టార్పాలిన్ల పంపిణీ ప్రభుత్వం నిలిపివేయడం సరైంది కాదు. టార్పాలిన్లు అందుబాటులో లేక చేతికి వచ్చిన పంటలు తడిసిపోతున్నాయి. ప్రైవేట్‌లో కొందామంటే నాణ్యత తక్కువ ధర ఎక్కువగా ఉంటుంది. ప్రభుత్వం రైతులకు టార్పాలిన్లు అందించాలి.

– బెండే లక్ష్మణ్, రైతు, వడ్డాడి

సబ్సిడీపై పంపిణీ చేయాలి



గత ఐదేళ్ల క్రితం వరకు టార్పాలిన్లు అవసరమైన రైతుల అందజేశాం. ప్రభుత్వం నుంచి ప్రస్తుతం వ్యవసాయశాఖ ద్వారా ఎటువంటి సబ్సిడీ పథకాలను అందించడం లేదు. ప్రభుత్వం తరపున సబ్సిడీపై టార్పాలిన్లు, ఇతర పరికరాలు వస్తే రైతులకు అందేలా చేస్తాం.

– రవీందర్ ఇన్‌చార్జి ఏడీఏ, తాంసి

ఓటు వినియోగంపై ర్యాలీ



రాచాపూర్‌లో మాట్లాడుతున్న ఎస్సై శ్రీకాంత్



కడెంలో ర్యాలీ తీస్తున్న ఐకేపీ సిబ్బంది

సారంగపూర్: మండలకేంద్రంలో గురువారం ఎంపీడీఓ సరోజ ఆధ్వర్యంలో ఓటుహక్కుపై విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఓటుహక్కు ప్రాధాన్యత, వినియోగంపై తహసీల్దార్ శ్రీదేవి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీఓ తిరుపతిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఆయా గ్రామాల ఐకేపీ, అంగన్‌వాడీ సిబ్బంది, బీఎల్‌ఓలు తదితరులు ఉన్నారు.

కడెం: అర్హులు తప్పనిసరిగా ఓటుహక్కును వినియోగించుకోవాలని ఏపీడీ గోవిందరావు అన్నారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో ఐకేపీ సిబ్బంది ర్యాలీ నిర్వహించి, ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. ఇందులో డీపీఎం శోభ, ఏపీఎం రాజారాం, సిబ్బంది ఉన్నారు.

లక్ష్మణచాంద: ధనం, మద్యం వంటి ప్రలోభాలకు లొంగకుండా ధైర్యంగా ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై శ్రీకాంత్ అన్నారు. గురువారం మండలంలోని రాచాపూర్‌లో గ్రామస్తులకు ఎస్సై ఎన్నికలపై అవగాహన కల్పించారు. ఎన్నికల ఉల్లంఘనలు జరిగితే డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. సీ–విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి నాగప్రతాప్, సిబ్బంది పాల్గొన్నారు.

కుంటాల: సామాన్యుడి వజ్రాయుధమైన ఓటును ప్రజలు ప్రలోభాలకు లొంగకుండా సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై హన్మాండ్లు అన్నారు. గురువారం మండలంలోని విఠాపూర్ గ్రామంలో ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ అడెల్లు, పంచాయతీ కార్యదర్శి కవిత, బీఎల్‌వో సురేఖ, ఎఫ్ఏ సుదర్శన్, కారోబారి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

వాంకిడి: పరిసరాల పరిశుభ్రత పాటించాలని హెచ్ఈవో రవిదాస్ పేర్కొన్నారు. మండలంలోని కనర్గాం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం పరిసరాలు శుభ్రత, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు.

భీంపూర్ మండలాన్ని దత్తత తీసుకుంటా

- బోథ్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సోయం బాపూరావు



వడ్‌గాంలో ప్రచారం చేస్తున్న సోయం బాపూరావు

తాంసి: ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే భీంపూర్ మండలాన్ని దత్తత తీసుకుంటానని బోథ్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు అన్నారు. గురువారం భీంపూర్ మండలంలోని లక్ష్మీపూర్, వడ్‌గాం, డబ్బుకుచ్చి, గుబిడిపల్లె, చింతగూడ, భీంపూర్, అందర్‌బంద్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. పది సంవత్సరాలు పాలించిన బీఆర్ఎస్ ఎలాంటి అభివృద్ధి చేయాలేదన్నారు. కార్యక్రమంలో రైల్వే బోర్డ్ మెంబర్ జీ.వి.రమణ, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సామ సంతోష్ రెడ్డి, సోయం వెంకటేశ్, దేవారెడ్డి, రాకేశ్ యాదవ్, రమేశ్, పాండ్‌రంగ్, కేశవ్, అశోక్, సుభాష్ పాల్గొన్నారు.

తండ్రీకొడుకుల ప్రచారం

తాంసి: ఎన్నికల్లో ఓటర్లను ఆకట్టుకునేందుకు నాయకులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. అభ్యర్థుల గెలుపు కోసం వారి బంధువులు ప్రచారం చేస్తున్నారు. గురువారం బోథ్ బీజేపీ అభ్యర్థి సోయం బాపూరావు, వారి కుమారుడు సోయం వెంకటేశ్‌తో కలిసి భీంపూర్ మండలంలో ప్రచారం చేశారు.

బీజేపీ గెలుపు.. అభివృద్ధికి మలుపు

బోథ్: బీజేపీ గెలుపు.. అభివృద్ధికి మలుపు అని బీజేపీ మండల కన్వీనర్ సుభాష్ సూర్య, కిసాన్ సెల్ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు అశోక్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పార్డి(కె), పుణ్యానాయక్ తండా, సంపత్ నాయక్‌తండా గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ డైరెక్టర్ మెస్రం భూమన్న, ప్రధాన కార్యదర్శి చాబంతుల కృష్ణ, విశాల్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ బలోపేతానికి పనిచేయండి

- ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్



ఖానాపూర్‌లో కండువా కప్పుతున్న జాన్సన్‌నాయక్

ఖానాపూర్: మూడోసారి కేసీఆర్ సీఎం అయ్యేలా బీఆర్ఎస్ కార్యకర్తలు పని చేయాలని ఆ పార్టీ ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్ అన్నారు. పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో మస్కాపూర్ గ్రామ సింగిల్‌విండో మాజీ చైర్మన్ దొనికేని చిన్నయ్య గురువారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో గజేందర్, రాజిరెడ్డి తదితరులు ఉన్నారు. జాన్సన్‌నాయక్‌ను గెలిపించాలని ఖానాపూర్ పట్టణంలోని ఐదో వార్డులో బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పరిమి సురేశ్, ఇర్ఫాన్, సతీశ్, వాసేఖాన్, ఫైసల్, దాము తదితరులున్నారు.

నేటి సభకు తరలిరావాలి

ఖానాపూర్: జన్నారంలో శుక్రవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ పాల్గొనే ప్రజాశీర్వాద సభకు కార్యకర్తలు తరలిరావాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు రాజగంగన్న, మున్సిపల్ చైర్మన్ రాజేందర్ పిలుపునిచ్చారు.

రైతులకు బాసటగా బీఆర్ఎస్

ఇంద్రవెల్లి: రైతులకు బాసటగా బీఆర్ఎస్ నిలుస్తోందని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. గురువారం మండలంలోని పిప్రి, చిలాటిగూడ, లక్కుగూడ, దేవాపూర్ గ్రామాల్లో ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఖానాపూర్ అభ్యర్థి భుక్యా జాన్సన్‌నాయక్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అంజద్, నాగోబా ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం తుకారం, నాయకులు భీంరావ్, కోవ రాజేశ్వర్, షేక్ సుఫీయన్, పర్సురాం రాథోడ్, శివాజీ పాల్గొన్నారు.

పోలీసుల కవాతు



కవాతులో పాల్గొన్న పోలీసులు

లోకేశ్వరం: ఈనెల 30న అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా ప్రజలు సహకరించాలని లోకేశ్వరం ఎస్సై సాయికుమార్ అన్నారు. గురువారం మండలంలోని మన్మద్, రాజూర గ్రామాల్లోని వీధుల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామాల్లో అవాంఛనీయ ఘటనలు జరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అనంతరం వాహనాలను తనిఖీ చేపట్టారు. వారి వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

'ఓపెన్ విద్య'లో ప్రవేశాలు

కుంటాల: ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో చేరేవారు ఈనెల16 నుంచి 30వరకు ప్రవేశం పొందాలని కుంటాల ఉన్నత పాఠశాల కోఆర్డినేటర్ వాటోలి ముత్యం, అసిస్టెంట్ కోఆర్డినేటర్ సగ్గం గంగాధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 85558 38196 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

'ఇష్టారీతిన విమర్శలు సరికాదు'

భైంసాటౌన్: బీజేపీ ముధోల్ అభ్యర్థి పవార్ రామారావుపటేల్‌పై బీఆర్ఎస్ నాయకురాలు పి.రమాదేవి ఇష్టానుసారం విమర్శలు చేయడం మానుకోవాలని బీజేపీ మహిళా మోర్చా నాయకులు పేర్కొన్నారు. గురువారం భైంసాలోని బీజేపీ కార్యాలయంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా మహిళా మోర్చా లోకేశ్వరం మండల అధ్యక్షురాలు అనసూయ మాట్లాడుతూ సర్వేలో రామారావుపటేల్‌కు గెలుపు అవకాశాలు ఉన్నందునే పార్టీ ఆయనకు టికెట్ కేటాయించిందన్నారు. మరి రమాదేవి ఎన్ని రూ.కోట్లు తీసుకుని బీఆర్ఎస్‌లో చేరారని ఆమె ప్రశ్నించారు. ఇప్పటికైనా ఇలాంటి విమర్శలు మానుకోవాలని హితవు పలికారు.

సమస్యలు పరిష్కరించే వారికే మద్దతు



మాట్లాడుతున్న జాడే నాగోరావు

నార్నూర్: గిరిజనేతరుల సమస్యలు పరిష్కరించే వారికే మద్దతు తెలుపుతామని గిరిజనేతరుల సంఘం జిల్లా అధ్యక్షుడు జాడే నాగోరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బౌద్ధవిహార్‌లో సమావేశం నిర్వహించారు. గిరిజనేతరుల సంఘం రాష్ట్ర నాయకుడు భారత్ వాఘ్మారే పాల్గొని మాట్లాడారు. ఏజెన్సీ చట్టాలకు ఎలాంటి హాని కలుగకుండా హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. గత 70 ఏళ్లకు పైగా సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వడంతో పాటు పోడుపట్టాలు అందించాలన్నారు. గిరిజనేతరుల సమస్యల పరిష్కారం కోసం ఎవరైతే స్పష్టమైన హామీ ఇస్తారో వారికే ఓటు వేస్తామన్నారు. సమావేశంలో నాయకులు కేంద్రే మాధవ్, కార్యదర్శి షేక్ దాదేఅలీ, నాయకులు బ్రిజ్‌లాల్, జాకురుల్లాఖాన్, సత్తార్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి అండ

- ఆర్థికసాయం అందించిన కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు



పరామర్శిస్తున్న నాయకులు

లక్ష్మణచాంద: మండలంలోని మునిపెల్లి గ్రామానికి చెందిన దూదేకుల షేక్ అహ్మద్ (64) బుధవారం నిర్మల్‌లో జరిగిన రేవంత్‌రెడ్డి సభకు వెళ్లి గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి అల్లోల సురేందర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు కొరిపెల్లి క్రిష్ణారెడ్డి గ్రామానికి వెళ్లి మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం రూ.20 వేలను సాయంగా అందించారు. అలాగే కాంగ్రెస్ నాయకులు అట్ల రాంరెడ్డి, ఈటెల శ్రీనివాస్, అట్ల చిన్న రాంరెడ్డి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి తమ వంతుగా రూ.50వేలు అందించారు. పలువురు గ్రామస్తులు రూ.3501 పోగు చేశారు. తమకు రూ.73,501 ఆర్థికసాయం అందినట్లు బాధిత కుటుంబసభ్యులు తెలిపారు. గురువారం అంత్యక్రియలు పూర్తయ్యాయి.

సాయిబాబా ఆలయంలో పూజలు



హారతి లో పాల్గొన్న భక్తులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని గండి రామన్న క్షేత్రంలో కొలువుదీరిన సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం పూజారులు భక్తులకు తీర్థ, ప్రసాదాలను అందజేశారు. అన్నదాతలుగా నిలిచిన సాయినిషిత, నిహర, రిత్విక, లక్ష్మీ–ధర్మరాజు, లత–అర్జున్, శిరీష–ప్రణయ్ దంపతులను ఆలయ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సాయిదీక్ష సేవా సమితి సభ్యులు జైపాల్‌రెడ్డి, ఉప్పుల నందు, జిందం గోవర్ధన్, సోమేశ్, భూషణ్, చౌదరి, ఆమెడ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. పట్టణంతోపాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు.

కుంటాల: మండలంలోని కల్లూర్ సాయిబాబా ఆలయంలో గురువారం భక్తుల సందడి నెలకొంది. భైంసా, లోకేశ్వరం దిలావర్‌పూర్, నర్సాపూర్(జి), కుంటాల మండలాల నుంచి మహిళలు పాదయాత్రగా ఆలయానికి చేరుకున్నారు. బాబాను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి



పరిశీలిస్తున్న తహసీల్దార్ మోతీరాం

లోకేశ్వరం: ఈనెల 30న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అన్ని సౌకర్యాలు కల్పించాలని తహసీల్దార్ మోతీరాం అన్నారు. గురువారం మండలంలోని బామ్ని(కే), గడ్‌చాంద, నగర్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ పరిశీలించి మాట్లాడారు. కేంద్రాల వద్ద దివ్యాంగులకు ర్యాంపు ఏర్పాటు చేయాలన్నారు. తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్డి సౌకర్యం కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎస్సై సాయి కుమార్, ఏపీవో జగన్నాథ్, ఉపాధిహామీ సిబ్బంది ఉన్నారు.

వసతులు కల్పించాలి

కుంటాల: పోలింగ్ కేంద్రంలో వసతులు కల్పించాలని ఎస్సై హన్మాండ్లు పేర్కొన్నారు. గురువారం మండలంలోని విఠాపూర్ గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. మరుగుదొడ్లు, మూత్రశాలలు, తాగునీటి వసతుల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వారి వెంట అర్ఐ అడెల్లు, పంచాయతీ కార్యదర్శి కవిత, బీఎల్‌వో సురేఖ, ఉపాధ్యాయులు సాయన్న, భీమన్న పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత



బాధితులకు నగదు అందిస్తున్న సభ్యులు

నర్సాపూర్(జి): మండలంలోని రాంపూర్‌కు చెందిన శాల జనార్దన్ 40 ఏళ్లుగా అదే గ్రామంలోని శివాజీ బీడీ హెడ్ ఆఫీస్‌లో ప్యాకింగ్ చేస్తూ అనారోగ్యానికి గురయ్యాడు. బుధవారం అతడు మృతి చెందగా.. ఈ విషయాన్ని గ్రామ యువకులు ×మన రాంపూర్‌×వాట్సప్ గ్రూపులో పోస్ట్ చేయగా పలువురు దాతలు స్పందించారు. ఉద్యోగులు, యువకులు రూ.14,600, జనార్దన్‌తో కలిసి పని చేసిన వారు రూ.ఏడు వేలు జమ చేశారు. గురువారం సభ్యులు సదరు నగదు రూ.21,600ను బాధిత కుటుంబసభ్యులకు అందించి సానుభూతి తెలిపారు.